సూర్య
కర్నూలు | నంద్యాల
గురువారం | 22 సెప్టెంబర్ 2022 | పేజీలు 8

## సిఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయండి

- అధికారులను ఆదేశించిన నంద్యాల జిల్లా కలెక్టర్



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ

**నంద్యాల టౌన్, మేజర్‌న్యూస్ :** ఈ నెల 28న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ది రామ్‌కో సిమెంట్ లిమిటెడ్ ప్రారంభోత్సవానికి రానున్న సందర్భంగా పర్యటన పనులు పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా. మనజిర్ జిలాని సమూన్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీసి హాల్‌లో సిఎం పర్యటన ఏర్పాట్ల పై జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి, జెసి నారపురెడ్డి మౌర్యతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ది రామ్‌కో సిమెంట్ లిమిటెడ్ జనరల్ మేనేజర్ రవికుమార్, ల్యాండ్ అండ్ లైసెన్ మిగతా 2లో

న్యాయరాజధాని కోసం

## ప్రాణ త్యాగానికైనా సిద్ధం

- న్యాయవాదుల దీక్షకు సంఘీభావంలో మేయర్ సంచలన వ్యాఖ్యలు
- త్వరలో రాజధాని సాధనకు దీక్ష చేపడుతాం
- పార్టీల కన్నా పుట్టిన గడ్డ ముఖ్యం
- మేయర్ బివై.రామయ్య



దీక్షకు మద్దతుగా మాట్లాడుతున్న మేయర్

**కర్నూలు, మేజర్‌న్యూస్ :** కర్నూలును న్యాయరాజధానిగా చేసేందుకు ప్రాణత్యాగానికైనా సిద్దంగా ఉన్నామని, పుట్టిన గడ్డ కోసం సంతోషంగా ప్రాణత్యాగం చేస్తానని నగర మేయర్ బి.వై.రామయ్య స్పష్టం చేశారు. బుధవారం ధర్నా చౌక్ వద్ద ఏపీ హైకోర్టును అమరావతి నుంచి కర్నూలుకు తరలించాలని జిల్లా న్యాయవాదులు చేపట్టిన 48 గంటల నిరాహారదీక్షకు మేయర్ బి.వై.రామయ్య సంఘీభావం తెలిపారు. కర్నూలు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.ఆర్.కృష్ణ, ఉపాధ్యక్షుడు కర్నాటి పుల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి పాండురంగ, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు పి.రవిగువేరా, సీనియర్ న్యాయవాదులు జయరాజు, ఓంకార్, ఎం.రాంనాథ్, బాబుసాబ్, ఆర్.నర్సింహులు, మురళీలతో పాటు జిల్లా న్యాయవాదులంతా దీక్షల్లో కూర్చున్నారు. ఈ దీక్షకు బుధవారం మేయర్‌తో పాటు సత్యసాయి జిల్లా హిందూపురం బార్ అసోసియేషన్ కూడా సంఘీభావం తెలిపింది. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ మిగతా 2లో



తనిఖీల అనంతరం స్టేషన్ ముందు పోలీసులు

## గుమ్మనూరుపై ఖాకీ పంజా...

- పేకాట ఆడుతున్నారన్న ఫిర్యాదుతో డీఎస్పీ ఆధ్వర్యంలో తనిఖీలు
- ముందే సమాచారంతో అప్రమత్తమైన పేకాటరాయుళ్లు
- గతంలో గుమ్మనూరులో పేకాట శిబిరాలపై దాడులు చేసిన పోలీసులు
- భారీ నగదు, కార్లు స్వాధీనం చేసుకున్న ఎఎస్పీ గౌతమిశాలిని

**ఆలూరు, చిప్పగిరి, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర కార్మిక శాఖ మంత్రిగుమ్మనూరు జయరాం సొంత గ్రామమైన గుమ్మనూరులో ఆదోని డీఎస్పీ వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు సుడిగాలి దాడులు నిర్వహించారు. బుధవారం జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ ఆదేశాల మేరకు చిప్పగిరి మండలం గుమ్మనూరు గ్రామంలో నారాయణ ఇంట్లో పేకాట ఆడుతున్నారన్న ఫిర్యాదు మేరకు డీఎస్పీ వినోద్‌కుమార్, నలుగురు సిఐలు, ఆరుగురు ఎస్సైలు, మరో 30 మంది పోలీసులు, స్పెషల్‌పోర్సు సిబ్బందితో కలిసి గుమ్మనూరు గ్రామంలో సోదాలు నిర్వహించారు. కాని ముందే సమాచారం రావడంతో మిగతా 2లో

మెనూ ప్రకారం

## మధ్యాహ్న భోజనం ఉండాలి

- కర్నూలు జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు



రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్

**ఓర్వకల్లు, మేజర్‌న్యూస్ :** మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం ఉండాలని జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు అధికారులను ఆదేశించారు. బుధవారం ఓర్వకల్లు జిల్లాపరిషత్తు ఉన్నత పాఠశాలలో జగనన్న గోరుముద్ద పథకం అమలును జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విద్యార్థులతో భోజనం ఎలా ఉంది, ఏ భోజనం పెడుతున్నారు అని ఆరా తీశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు చేతులు కడుగుకునే ప్రాంతం పరిశుభ్రంగా ఉంచాలని హెడ్‌మాస్టర్ విజయలక్ష్మిని ఆదేశించారు. పిల్లలందరికి నులిపురుగుల నివారణ కోసం ఆల్బెండజోల్ మాత్రలను ఇచ్చారా లేదా అని అడిగారు. మైదానంలో వర్షం పడినప్పుడు బురద ఎక్కువగా ఉండడం వల్ల విద్యార్థులకు ఇబ్బందిగా మిగతా 2లో

మండల ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాలకే అంకితమా? 7లో

అర్ధరాత్రి రేషన్ బియ్యం పట్టివేత 3లో

## ఏసీబీ వలలో గృహ నిర్మాణ శాఖ వర్క్ ఇన్‌స్పెక్టర్

- రూ.5 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన వైనం
- లంచం అడిగితే ఫిర్యాదు చేయండి : ఏసీబీ డీఎస్పీ



పట్టుబడిన వర్క్ ఇన్స్‌పెక్టర్ విశ్వేశ్వర్‌రెడ్డి

**ఆళ్లగడ్డ, మేజర్‌న్యూస్ :** జిల్లా అవినీతి అధికారుల చేతికి మరో అవినీతి అధికారి పట్టుబడ్డారు. బుధవారం సాయంత్రం ఆళ్లగడ్డ పట్టణంలోని మంజునాథ ట్రేడర్స్ వద్ద రూ.5 వేలు లంచం తీసుకుంటూ ఉయ్యాలవాడ మండలానికి చెందిన గృహ నిర్మాణ శాఖ వర్క్ ఇన్‌స్పెక్టర్ విశ్వేశ్వర్‌రెడ్డి అవినీతి నిరోధక శాఖ అధికారులకు పట్టుబడ్డారు. అవినీతి నిరోధక శాఖ డీఎస్పీ శివ నారాయణస్వామి చెప్పిన వివరాలిలా ఉన్నాయి... ఉయ్యాలవాడ మండలం తుడుములదిన్నె గ్రామానికి చెందిన జాలిగాళ్ళ ఓబులేసు జగనన్న కాలనీలో ఇల్లు నిర్మించుకుంటు న్నాడు. మూడు విడతలుగా అతనికి బిల్లులు మంజూరయ్యి నేరుగా అతని ఖాతాలో జమ చేయబడ్డాయి. నాలుగో విడత బిల్లులు పెట్టాలని వర్క్ ఇన్‌స్పెక్టర్ విశ్వేశ్వర్‌రెడ్డిని కోరగా నీవు పాత బిల్లులకు సంబంధించి మామూలు ఇవ్వలేదని, ఈ బిల్లు పెట్టాలంటే మామూలు ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారు. దీంతో జాలిగాళ్ళ చిన్న ఓబులేసు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. ఏసీబీ అధికారులు పథకం మిగతా 2లో

# అర్ధరాత్రి రేషన్ బియ్యం పట్టివేత

**సివిల్ సప్లై అధికారుల కోసం పోలీసుల ఎదురు చూపులు**
**అటు వైపు కన్నెత్తి చూడని సివిల్ సప్లై అధికారులు**
**గతంలో విఆర్‌వోల ద్వారానే పంచనామాల నిర్వాహణ**


పోలీసులు స్వాధీనం చేసుకున్న లారీ

**బండిఆత్మకూరు , మేజర్‌న్యూస్ :** బండిఆత్మకూరు మండలంలో మంగళవారం అర్ధరాత్రి లారీలో తరలిస్తున్న మిక్సర్ రేషన్ బియ్యం లారీని బండిఆత్మకూరు పోలీసులు పట్టుకొని స్టేషన్‌కు తరలించారు. జిల్లా ఉన్నతాధికారుల నుంచి అందిన సమాచారం మేరకు లారీలో ఉన్న దాదాపు 600 బస్తాలు (ఒక బస్తా 50 కేజిలు) గల లారీని వెంబడించి స్థానిక రాఘవేంద్ర స్కూల్ వద్ద అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.వారి వద్ద ఉన్న అధారాలు సరి పోలక అక్రమంగా తరలిస్తున్నారని పోలీసులు లారీని స్టేషన్‌కు తరలించారు.ఈ సమాచారాన్ని స్థానిక సివిల్ అధికారలకు తెలిపి పంచ నామ నిర్వహించాల్సించాలని అధికారులకు సూచించారు.పంచనామా నిర్వహించాల్సిన సివిల్ సప్లయ్ అధికారులు అటు వైపు కన్నెత్తి చూడకపోవంతో పోలీసులు వేచి చూడాల్సి పరిస్థితి ఏర్పడింది. గతంలో మండలంలో ఎ్కకడైన భారీ మొత్తంలో రేషన్ బియ్యం పట్టుకున్నా స్థానిక వీఆర్వోల ద్వారా పంచ నామ నిర్వహించి కేసులు నమోదు చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. సివిల్ సప్లయ్ అధికారులు మండలంలో ఎక్కడైనా రేషన్ బియ్యం పట్టుకుంటే కనీసం పరిశీలించడానికి రావడం లేదని పట్టుకున్న రేషన్ బియ్యాన్ని నంద్యాలకు తరలించే విధంగా స్థానిక విఆర్‌ఓలకు మొకిక ఆదేశాలు అందుతున్నాయని మండల వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికైన సివిల్ అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

# ఫోటోగ్రాఫర్ మృతికి సంతాపం..ఫోటోస్టూడియోలు బంద్

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** వెల్దుర్తి మండలం పుట్లూరు గ్రామానికి చెందిన ఫోటోగ్రాఫర్ హనుమన్న(హనుమంతు) మృతికి సంతాపంగా బుధవారం కర్నూలులో ఫోటో స్టూడియోలను బంద్‌చేసి అతని ఆత్మకు శాంతికలగాలని ప్రార్థించారు. స్థానిక ఆర్ ఆర్ ఆసుపత్రి వద్ద ఉన్న ఎస్ఎస్‌పి ఆర్కేడ్ కాంప్లెక్స్ ముందు మొదటగా హనుమంతు, ఆర్.కె. ల్యాబ్‌లో పనిచేస్తున్న కృష్ణమూర్తిల మృతికి సంతాపంగా రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. ఫోటోగ్రాఫర్లు తమ షాపులను బంద్‌చేసి సంతాపాన్ని తెలిపారు. ఆయన మృతి తీరని లోటు అని, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగరంలోని పలు స్టూడియోల ప్రతినిధులు, ఫోటో గ్రాఫర్లు పాల్గొన్నారు.


సంతాపం తెలుపుతున్న ఫోటో గ్రాఫర్లు

# మిల్లు యాజమాన్యం రైతులకు అండగా నిలువాలి

**– వైకాపా సీనియర్ నాయకులు వై .నారాయణరెడ్డి**

**కల్లూరు రూరల్, మేజర్ న్యూస్:** గ్రామీణ ప్రాంతాలలో 80శాతం మంది వ్యవసాయం పై ఆధారపడి జీవనం సాగిస్తూ పండిన పంటలను మిల్లులకు తీసుకొచ్చినప్పుడు రైతులకు అండగా నిల్చి ఆదుకోవాలని రేమడూరు గ్రామ సీనియర్ వైకాపా నాయకులు వై నారాయణరెడ్డి మిల్లు యాజమాన్యం కె.మల్లికార్జున శెట్టికి వారి సిబ్బందిని కోరారు. బుధవారం మండల పరిధిలోని రేమడూరు గ్రామంలోని వాసవి రైస్ మిల్లును ఆయన సందర్శించి అక్కడ పరిస్థితులపై ఆరాతీశారు. మిల్లుకు వచ్చిన రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్య మంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రైతుల సంక్షేమం కోసం కోట్ల నిధులు వేచ్చించి వారికి అండగా నిలుస్తున్నార న్నారు. రైతులు ఆరుగాలం పండించి రైస్ మిల్లులకు వరి, కొర్రలు


రైస్ మిల్లును సందర్శించిన వైకాపా నాయకులు

తదితర రకాల దాన్యంను తీసుకొని వచ్చినప్పుడు ఎలాంటి మోసాలకు పాల్పడకుండ పండిన దాన్యంను బియ్యం ఆడించి సరసమైన ధరలు తీసుకోవాలని యాజమాన్యంను కోరారు. రైతులు పంటలకు పెట్టిన పెట్టుబడులు కూడా సరిగా రాక తీవ్ర ఇబ్బందులు పడుతూ గత ప్రభుత్వంలో నష్టాల ఊబిలో కొట్టి మిట్టాడుతున్న రైతాంగాన్ని వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పెట్టుబడి సహాయం, పంట నష్ట పరిహారం, సబ్సిడిపై విత్తనాలు, వ్యవసాయ పరికరాలు, ఆర్‌బీకేల ద్వారా వై ఎస్ఆర్ వాహన మిత్ర ద్వారా మిని ట్రాక్టర్లు, పెద్ద ట్రాక్టర్లు, వ్యవసాయ పనిముట్లు అందించి రైతులకు అండగా నిల్చిందన్నారు. పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సలహా సూచనల మేరకు గ్రామాల అభివృద్ధికి పాటు పడుతున్నామన్నారు. గ్రామీణ ప్రాంతాలలో నెలకొల్పి జీవనం సాగిస్తున్న కుటీర పరిశ్రమలను సందర్శించి వారి బాగోలు తెలుసుకొని ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడి రుణాలు సద్వినియోగంపై అడిగి తెలుసుకుంటున్నామన్నారు. మిల్లు యాజమాన్యం రైతులకు అందిస్తున్న సౌకర్యాలపై సంతృప్తి పొంది హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మిల్లు అధినేత కె.మల్లికార్జునయ్య, గ్రామ వైకాపా నాయకులు బోయ శివలింగం, హరిజన మౌలాలి, రైతులు పాల్గొన్నారు.

## ఎంపియూపీ పాఠశాల తనిఖీ

**దొర్నిపాడు,మేజర్‌న్యూస్ :** మండలపరిధిలోని ఎంపియూపీ పాఠశాలను మండల విద్యాశాఖ అధికారి కే మనోహర్ రెడ్డి బుధవారం తనిఖీ నిర్వహించారు.ఈ సందర్భంగాఅయన మాట్లాడుతూ విద్యార్థులకు పాఠశాలలోఅందించే మధ్యాహ్నబోజనంలో మెనూ తప్పక పాటించి నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఆయన సూచించారు పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని విద్యార్థుల హాజరు శాతం ఎప్పటికప్పుడు మెరుగు పరచుకోవాలని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగరాజుకు సూచించారు.విద్యార్థుల్లో బోధన సామర్థ్యలను పెంచాలనిఅయన అన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించి విద్యా ర్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు కృషిచేయాలనీ అయన అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధా నోపాధ్యాయులు నాగరాజు. ఉపాధ్యాయులు జనార్దన్. కళ్యాణ్, ముస్తఫా, వెంకటేశ్వరరెడ్డి, జయప్రదమ్మ. ఓబుళ మ్మ విద్యార్థులు పాల్గొన్నారు.



## పర్యావరణ పరిరక్షణకై ప్రతి ఒక్కరు పాటుపడాలి


మాట్లాడుతున్న ఈ ఓ ఆర్ డి

**కల్లూరు రూరల్ మేజర్ న్యూస్:** పర్యావరణ పరిరక్షణకై ప్రతి ఒక్కరు పాటుపడి వాటిని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఆసన్నమైందని రిలయన్స్ ఫౌండేషన్, ఆపార్డు సంస్థల రిసోర్స్ పర్సన్ ఉరుకుంద అన్నారు. ఈ మేరకు బుధవారం మండల పరిధిలోని పర్ల గ్రామ సచివాలయంలో రిలయన్స్ ఫౌండేషన్ ,అపార్డ్ సంస్థల అద్వర్యం లో పంచాయతీసభ్యులకు వాతావరణ మార్పులు ఆధారంగా అనుకూల చర్యలను పాటించడం అనే అంశాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమం లో రిసోర్స్ పర్సన్ ఉరుకుంద మట్లాడుతు ప్రస్తుత మానవుని అలవాట్ల వల్ల పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని ఇప్పటికే పర్యావరణం కలుషితమై మానవుని మనుగడకు ఎంతో హానికరంగా మారిందని ఇప్పటికైనా మేల్కొని పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకొని కాపాడుకోవాలని లేకపోతే రానున్న భవిష్యత్తు కాలాల ప్రజల మనుగడ కష్టతరంగా మారుతుందని హెచ్చరించారు.గ్రామస్థాయి నుండి పర్యావరణ పరిరక్షణపై ప్రతి ఒక్కరు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి మొక్కలను విరివిరిగా పెంచి చెట్లు నరకడం మానుకోవాలన్నారు. అలాగే ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిస్థాయిలో తగ్గించి వాతావరణంను కాపాడేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. గ్రామ సర్పంచ్ హనుమక్క ,ఎంపీటీసీ శేషన్న, ఈ ఓ ఆర్ డి కిషోర్, పంచాయతీ సెక్రెటరీ వేణుగోపాల్ ,సచివాలయ సిబ్బంది వార్డు సభ్యులు ,సచివాలయ సిబ్బంది, గ్రామ వాలంటీర్లలు పాల్గొన్నారు.




# గుర్తు తెలియని శవం లభ్యం

★నాగులదిన్నె వంతెన దగ్గర కాలువలో పడిఉన్న యువకుడు

**ఎమ్మిగనూరు ప్రతినిధి, (నందవరం ) మేజర్‌న్యూస్ :** నాగులదిన్నె వంతెన సమీపంలో కాలువలో గుర్తు తెలియని శవం బుదవారం స్థానికులకు కనిపించింది.. విషయాన్ని నందవరం పోలీసులకు చేరవేశారు స్థానికులు దీంతో నందవరం ఎస్ఐ మహేష్‌కుమార్ పోలీస్ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని నీటిలో బోర్ల పడిఉన్న శవాన్ని వెల్లకిలా వేసి పరిశీలించారు.. ఈ పరిశీలనో యువకుడి వయస్సు 28 నుండి 32 మద్యలో ఉండొచ్చన్నారు. ఒంటిపై నల్లని టీషర్ట్, ఆకుపచ్చ లోయర్ ఉన్నాయనని లోయర్ ఎమ్మిగనూరు పట్టణంలోని మేఘనా స్పోర్ట్‌వేర్‌లో కుట్టించుకోవడం జరగడంతో ఎమ్మిగనూరు పరిసరాలవాసిగా నిర్ధారణ అవుతుందని అనుమానాం వ్యక్తం చేస్తున్నారు. అయితే కుడి చెయ్యికి పులి, ఎడమచెయ్యికి బాగ్‌బాస్ అనే పచ్చబొట్లు ఉన్నట్లు ఆయన వెల్లడించారు.వ్యక్తిని గుర్తు పట్టిన వారు 9121101150, 9121101146 నెంబర్‌లకు కాల్ చెయ్యాలని తెలిపారు.

## అంతర్ జిల్లా బైక్ దొంగలు అరెస్టు– 23 బైక్‌లు స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న డిఎస్పీ వెంకటరామయ్య

**కోవెలకుంట్ల, మేజర్‌న్యూస్ :** కోవెలకుంట్ల పట్టణ శివారులోని రైల్వే బ్రిడ్జి వద్ద బుధవారం కోవెలకుంట్ల ఎస్సై చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసు సిబ్బందితో తనిఖీలు నిర్వహిస్తుండగా అంతర్ జిల్లా బైక్ దొంగలను గుర్తించడంతో వారిని అదుపులోకి తీసుకొని విచారించగా బైక్ దొంగల వ్యవహారం బయటపడింది. ఆళ్ళగడ్డ డిఎస్పీ వెంకటరామయ్య విలేఖరులతో మాట్లాడుతూ అనంతపురం జిల్లా యాడికి మండలం కుందనకోట గ్రామానికి చెందిన హరికృష్ణ , తరుణ్, నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలం గొర్విమానుపల్లె గ్రామానికి చెందిన తిరుపాలు అనే వ్యక్తులు గత కొంత కాలం నుంచి బైక్‌లను దొంగతనం చేస్తున్నారు. వీరు నంద్యాల, కర్నూలు, వైఎస్సార్ జిల్లా, అనంతపురం జిల్లాల్లోని వివిధ ప్రాంతాల్లో 23 బైక్‌లను చోరీ చేశారు. దొంగలించిన బైక్‌లను సంజామాల మండలం ఆకుమల్ల గ్రామానికి చెందిన రమేష్ ,చిన్నరాముడు,అవుకు మండలం సింగనపల్లె గ్రామానికి చెందిన దస్తగిరి, శివ శంకర్ అనే వ్యక్తులకు విక్రయిస్తుండగా అందిన సమాచారం మేరకు పోలీసులు దాడి చేశారు. బుధవారం రైల్వే బ్రిడ్జి వద్ద వీరిని అదుపులోకి తీసుకొని 23 బైక్‌లు స్వాధీనం చేసుకొని కోర్టులో హాజరుపరిచామని డిఎస్పీ తెలిపారు. మెజిస్ట్రేట్ వారిని రిమాండ్‌కు పంపించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై చంద్రశేఖర్‌రెడ్డి, పోలీసులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో కానిస్టేబుల్ మృతి


మృతిచెందిన స్వాములు

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** గత కొంతకాలంగా అనారోగ్యంతో తీవ్రంగా ఇబ్బంది పడుతూ చికిత్స పొందుతూ కోలుకోలేక కానిస్టేబుల్ స్వాములు బుధవారం మృతిచెందారు.ఆయన ప్రస్తుతం ఉలిందకొండ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నా రు. ఎన్నో ఏళ్లుగా కర్నూలు జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్‌లలో పని చేసి స్వాములు మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఆయన మృతి పట్ల పోలీస్ వెల్ఫేర్ అసోసియేషన్ సంతాపాన్ని వ్యక్తం చేసింది.

## ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ పేరు మార్పుపై తెదేపా నిరసన


టిడిపి కార్యాలయంలో తమ్ముళ్ల ఆందోళన

**ఆదోని టౌన్, మేజర్ న్యూస్:** హెల్త్ యూనివర్సిటీకి ఎన్టీఆర్‌పేరు మార్చడాన్ని నిరసిస్తూ ఆదోనిలో తెలుగుదేశం పార్టీ శ్రేణులు, నందమూరి అభిమానులు ఆందోళనకు దిగారు. బుధవారం ఆదోని నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే కె. మీనాక్షినాయుడు ఆదేశాలమేరకు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టిడిపి కార్యకర్తలు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఎన్టీఆర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. ఎన్టీఆర్ వర్శిటీ పేరు మార్పును వారు తీవ్రంగా ఖండించారు. 1998లో పెట్టిన ఎన్టీఆర్ పేరును మార్చాలని, ఆ తర్వాత వచ్చిన ఏ ముఖ్యమంత్రీ ఆ ఆలోచన చేయలేదని, ఎన్టీఆర్ పేరును మార్చాలన్న పిచ్చి ఆలోచనలను మానుకోవాలని హితవు పలికారు. ఎన్టీఆర్ పేరును యధావిధిగా కొనసాగించాల్సిందేనని తెదేపా శ్రేణులు, నందమూరి అభిమానులు డిమాండ్ చేశారు.

# ప్రమాదవశాత్తు మహిళ మృతి

**ఓర్వకల్లు, మేజర్‌న్యూస్ :** ద్విచక్ర వాహనం నుంచి కిందపడి మహిళ మృతి చెందిన సంఘటన ఓర్వకల్లు మండలంలోని చింతలపల్లె గ్రామ ంలో చోటు చేసుకుంది. ఎస్సై మల్లికార్జున తెలిపిన వివరాల మేరకు చింతలపల్లె గ్రామానికి చెందిన బోయ రాముడు భార్య బోయ వెంకట లక్ష్మమ్మ (45) అదే గ్రామానికి చెందిన మధుకృష్ణ ద్విచక్ర వాహనం పై మంగళవారం చింతలపల్లె నుంచి పాలకొలనుకు వెళ్తుండగా మార్గ మధ్యలో నాగేంద్ర పొలం వద్ద రోడ్డుకు అడ్డంగా కుక్క రావడంతో తప్పించబోయి బ్రేక్ వేయగా వెంకటలక్ష్మమ్మ కిందపడింది. చికిత్స నిమిత్తం అమిలియో ఆసుపత్రిలో తరలించగా చికిత్స పొం దుతూ కోలుకోలేక మంగళవారం రాత్రి మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలి భర్త రాముడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతురాలికి ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు సంతానం.

సూర్య

గురువారం 22 సెప్టెంబర్ 2022

## ఎన్టీఆర్ హెల్త్ యూనివర్శిటీ పేరు మార్చడం అన్యాయం



ఆందోళన చేస్తున్న ఎం.మోహన్

**కర్నూలు, మేజర్‌న్యూస్ :** ఎన్టీఆర్ హెల్త్ యూనివర్శిటీకి తెలుగువాడి గొప్పతనాన్ని నలుదిశల వ్యాప్తి చేసిన మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు పేరును మారుస్తూ అసెంబ్లీలో బిల్లు పెట్టడాన్ని ఏపీఎన్ఎస్ఎస్, ఏపీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.మోహన్ ఖండించారు. బుధవారం ఆయన ఒక పత్రిక ప్రకటన విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి పేర్లు మార్చడం మీద పెట్టే దృష్టి ప్రజా పాలనలో పెట్టడం లేదన్నారు. ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ పేరు ఎంతో ప్రఖ్యాతులు గాంచిందన్నారు. అటువంటి యూనివర్శిటీ పేరు మార్చడం బాధాకరమన్నారు. తిరిగి పాతపేరునే కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చివరకు పేర్ల కోసం కూడా పోరాటాలు చేసే పరిస్థితి రాష్ట్రప్రభుత్వం తెచ్చుకోవడం దారుణమన్నారు.

## అక్టోబరు 30న జాతీయస్థాయి శాస్త్రీయ నృత్య పోటీలు

**కర్నూలు నగరం, మేజర్‌న్యూస్** : ఎస్.వి.సుబ్బారెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అక్టోబరు 30వ తేదీన జాతీయ స్థాయి శాస్త్రీయ నృత్యపోటీలు 21వ జాతీయ స్థాయి జాతీయ సాంస్కృతిక మేళాలో భాగంగా నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, కర్నూలు మాజీ ఎమ్మెల్యే ఎస్.వి.మోహన్‌రెడ్డి, అధ్యక్షులు లయన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్‌లు ఒక సంయుక్త ప్రకటనలో బుధవారం తెలిపారు. కృష్ణానగర్‌లోని శ్రీలక్ష్మి ఫంక్షన్‌హాల్‌లో పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. సబ్‌జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగాలలో సోలో, డ్యూయెట్, గ్రూప్స్ విభాగాలలో పోటీలు ఉంటాయన్నారు. మరిన్ని వివరాలకు వీఆర్ కాలనీలోని నైస్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ సెంటర్‌లో సంప్రదించాలని కోరారు.

## విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ



విద్యార్థులతో మాట్లాడుతున్న డాక్టర్ సరిత

**తుగ్గలి, మేజర్‌న్యూస్ :** మండలంలోని విద్యార్థులకు నులిపురుగల నివారణ కోసం వారికి వైద్య అధికారులు డాక్టర్ ప్రవీన్‌కుమార్, డాక్టర్ సరితలు బుధవారం అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒక సంవత్సరం పైబడిన చిన్నారుల నుంచి 19 సంవత్సరాల వయసు గల అందరికి ఈ మాత్రలను ఇవ్వడం జరిగిందన్నారు. ఈ మాత్రలు వేసుకోవడం వల్ల కడుపులో ఉండే నూలు పురుగులు అంతమై వారిలో పౌష్టికాహార శక్తి పెరుగుతుందన్నారు. అందువల్ల ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## నాడు నేడు అభివృద్ధి పనులకు భూమిపూజ



అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న నాయకులు

**తుగ్గలి, మేజర్‌న్యూస్ :** రాష్ట్రంలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నారని సహకార సంఘం ఛైర్‌పర్సన్ విజయలక్ష్మి, జడ్పీటీసీ పులికొండ నాయక్‌లు అన్నారు. బుధవారం తుగ్గలిలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో రూ. 60 లక్షలతో నాడు నేడు కింద మంజూరైన 5 అదనపు గదుల నిర్మాణానికి విద్యాకమిటీ ఛైర్మన్ మల్లికార్జునతో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే శ్రీదేవమ్మ సహకారంతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజు, రామాంజనేయులు, పురుషోత్తం, మండల విద్యాశాఖ అధికారి రామ వెంకటేశ్వర్లు గౌడ్, ప్రధానోపాధ్యాయురాలు ఉమా, ఉపాధ్యాయులు అంగడి లోకేష్, సుధాకర్‌గౌడ్, ఇంజినీరు మురళీ, సచివాలయ అధికారులు, వాలంటీర్లు, వైకాపా నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## డ్రాపౌట్ విద్యార్థులకు ఫీజులు వెనక్కి ఇవ్వాలి




ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

**కర్నూలు ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్ :** నగరంలోని భాష్యం పాఠశాలలో డ్రాప్‌అవుట్ అయిన విద్యార్థులకు కట్టిన ఫీజులు వెనక్కి ఇవ్వాలని డీఎస్ఎఫ్, నవ్యాంధ్ర విద్యార్థి యువజన జేఏసీ, డీఎస్‌యూ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో బుధవారం బీక్యాంప్ స్కూల్ ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘం నాయకులు మహేంద్రనాయుడు, అయ్యప్పస్వామి, శరత్‌లు మాట్లాడుతూ 2022-23 అకాడమిక్‌లో ఆయిన్ అయిన విద్యార్థులు చేరకుండా వెనక్కు వెళితే వారు కట్టిన ఫీజులు ఇవ్వకుండా తల్లిదండ్రులను వేధింపులకు గురిచేస్తున్నారన్నారు. కట్టిన ఫీజులు వెనక్కు ఇవ్వమని అడుగుతున్నా విద్యార్థుల తల్లిదండ్రులను తప్పుడు మాటలతో మభ్యపెట్టడం సమంజసం కాదన్నారు. జిల్లా విద్యాశాఖ అదికారులు తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. నగర నాయకులు శేఖర్, హర్ష, రాజు, శేఖర్, అఖిల్, పులిరాజ్, సూరి పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం



నులి పురుగుల మందులను పంపిణీ చేస్తున్న వైద్యులు

**కొత్తపల్లి, మేజర్‌న్యూస్ :** మండలంలోని కొత్తపల్లి, యర్రమఠం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఉన్న పాఠశాలల్లో జాతీయ నులి పురుగుల దినోత్సవంను బుధవారం ఘనంగా జరుపుకున్నారు. 5 సంవత్సరాల నుంచి 15 సంవత్సరాల్లోపు పిల్లలకు ఆల్‌బెండజోల్ మాత్రలను పంపిణీ చేసినట్లు వైద్యులు వినోద్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ మాత్రలను మింగడం వల్ల చిన్నారులు ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల చిన్నారులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఏదైనా అనారోగ్యం కలిగినట్లు అయితే వెంటనే వైద్యులను సంప్రదించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఓ బాలకృష్ణ , వైద్య సిబ్బంది, పాల్గొన్నారు.

## డ్రోన్‌ల ద్వారా రసాయన ఎరువుల పిచికారిపై రైతులకు అవగాహన

### – పత్తి పంటలో వచ్చే పొగాకు స్ట్రిక్ వైరస్ పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలి



రైతులకు డ్రోన్ పై అవగాహన కల్పిస్తున్న అధికారులు

**జూపాడుబంగ్లా, మేజర్‌న్యూస్ :** మండల పరిధిలోని మండ్లెం గ్రామంలోని రైతులకు డ్రోన్‌ల సహాయంతో రసాయన మందుల పిచికారి గురించి ఏడిఏ విజయశేఖర్, మండల వ్యవసాయ అధికారి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. టిజెంత కంపెనీ వారి సౌజన్యంతో ఈ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డ్రోన్‌ల ద్వారా పంట పొలాలకు రసాయన ఎరువులు పిచికారి చేసుకోవడం వల్ల మంచి ఉపయోగాలు ఉంటాయని అధికారులు తెలిపారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పొలానికి మందు పిచికారి చేసుకోవచ్చని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలన్నారు.

**పత్తి పంటలో వచ్చే తెగుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలి**

మండల పరిధిలోని తర్తూరు గ్రామంలో మండల వ్యవసాయ అధికారి కృష్ణారెడ్డి రైతులతో కలిసి పత్తి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తి పంటలో ప్రధానంగా పొగాకు స్ట్రిక్ వైరస్ సోకిందని రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణ చర్యలు గురించి అవగాహన కల్పించినట్లు తెలిపారు. రైతులు ప్రతిరోజు పత్తి పంటను పరిశీలించుకుంటుండాలని అలాగే అధికారుల సలహాలతో నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. పొలం గట్ల పక్కనున్న పార్థీనియం కలుపు మొక్కల పుప్పొడి రేణువులలో నుంచి తామర పురుగు, రసం పీల్చే పురుగుల ద్వారా ఈ వైరస్ సోకుతుందని తెలిపారు. వీటి నివారణకు వ్యవసాయ అధికారుల సలహాలు తీసుకొని మందులు పిచికారి చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తర్తూరు గ్రామ సర్పంచు నాగిరెడ్డి, గ్రామ రైతులు, తదితరులు పాల్గొన్నారు.



సీసీ కెమెరాలో రికార్డు అయిన దాడి దృశ్యాలు

## హెడ్‌కానిస్టేబుల్ వీరంగం

**పత్తికొండ, మేజర్‌న్యూస్ :** సామాన్య ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీస్ ఓ సామాన్యుడిని రోడ్డుపై చితకబాదిన సంఘటన పత్తికొండలో చోటుచేసుకుంది. హెడ్‌కానిస్టేబుల్ జయన్న స్కూటర్‌పై వెళ్తున్న వ్యక్తిని రోడ్డుపై చితకబాదడంపై పలు విమర్శలకు తావిస్తోంది. పత్తికొండ అర్బన్ పీఎస్‌లో విధులు నిర్వహిస్తున్న జయన్న మంగళవారం సాయంత్రం ఆదోని రోడ్డు పుష్ప హాస్పటల్ సమీపంలో పందికోన గ్రామానికి చెందిన వసంతకుమార్‌ను దుర్భాషలాడి పిడి గుద్దులతో దాడి చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ కానిస్టేబుల్ ఎక్కడ పడితే అక్కడ దందాలు చేస్తున్నట్లు పత్తికొండలో స్థానికులు గుసగుసలాడుకుంటున్నారు. కాపాడాల్సిన పోలీసులే విధంగా ప్రవర్తిస్తే ప్రజలకు రక్షణ ఎవరు కల్పిస్తారని ప్రజలు చర్చించుకుంటున్నారు.

## నులి పురుగుల నివారణ కార్యక్రమం

**శిరివెళ్ళ, మేజర్‌న్యూస్ :** శిరివెళ్ళ మండల కేంద్రంలో నులి పురుగుల నివారణ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని డా.విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. డా.విజ య్‌కుమార్ మాట్లాడుతూ నులి పురుగుల వల్ల పిల్లల్లో ఎదుగుదల లోపం, వాంతులు, కడుపునొప్పి, తదితర వ్యాధులు వస్తాయని తెలిపారు. ప్రభుత్వం ప్రతి సంవత్సరం రెండుసార్లు ఆరు నెలలకు ఒకసారి ఆల్‌బెండజోల్ మాత్రలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ మాత్రలను అన్ని పాఠశాలలు, కళాశాలల్లో ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ మాత్రల వల్ల నులి పురుగుల నుంచి సురక్షితంగా ఉండవచ్చని తెలిపారు. బహిరంగ మలవిసర్జన చేయకూడదని అన్నారు. భోజనం చేసే ముందు చేతులు శుభ్రంగా ఉంచుకోవాలని విద్యార్థులకు తెలిపారు.

## కార్పోరేట్‌కు ధీటుగా విద్యా వ్యవస్థ



భూమిపూజ చేస్తున్న ఎర్రకోట

**ఎమ్మిగనూరు ప్రతినిధి, (నందవరం) మేజర్‌న్యూస్ :** రాష్ట్రంలో జగనన్న పాలన వచ్చాక విద్యావ్యవస్థలో సంచలనాత్మక మార్పులు తీసుకొచ్చి విద్యను కార్పోరేట్ పాఠశాలలకు ధీటుగా అందించడమే కాక , పాఠశాలల్లో నాడు– నేడు అంటూ పెను మార్పులు తీసుకురావడం జరిగిందని ఎమ్మిగనూరు వైసిపి నాయకులు ఎర్రకోట జగన్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. బుదవారం నందవరం మండల పరిధిలోని టిజ సోమలగూడూరు గ్రామంలోని పాఠశాలకు రూ. 54 లక్షలతో నిర్మించ తలపెట్టిన అదనపు గదులకు ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి ఆదేశాల మేరకు భూమిపూజ చేశారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ గతంలో విద్యర్థుల సమస్యలు ఏ ప్రభుత్వం తీర్చలేదని, విద్యకు పెద్దపీట వేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రతి ఇంట విద్యా కుసుమాలు పూయ్యాలనే సంకల్పంతో అమ్మల ఖాతాలో నేరుగా 14 వేల రూపాయలు వేసి విద్యను ప్రోత్సహించిన ఏకైక ముఖ్యమంత్రి మన జగనన్న చరిత్రలో నిలిచి పోతారన్నారు. కావున రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న విద్యా వ్యవస్థకు మార్పులకు అనుసందానంగా ప్రతి విద్యార్థినీ, విద్యార్థులు కష్టపడి చదువులు కొనసాగించి భావితరాల్లో మంచి జీవితం గడుపుకోనుటకు బాటలు వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ సుదర్శన్‌రెడ్డి, ఏఈ జయ్యన్న, వైసిపి నాయకులు ప్రకాష్‌రెడ్డి, వెంకటేష్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, రంగారెడ్డి, పాఠశాల ఎఫ్ఏసి చైర్మన్ డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ వసతి గృహాల విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి : ఏఐఎస్ఎఫ్



**కల్లూరు, మేజర్‌న్యూస్ :** కర్నూలు నగరంలో ఉన్న ప్రభుత్వ సాంఘీక సంక్షేమ వసతి గృహాల విద్యార్థుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ నగర అధ్యక్షులు ఎస్.శరత్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సంక్షేమ భవన్ ముందు ధర్నా నిర్వహించి, అనంతరం జిల్లా బీసీ సంక్షేమాధికారి వెంకటలక్ష్మమ్మకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎస్.శరత్‌కుమార్, సహాయ కార్యదర్శి జి.మునిస్వామి మాట్లాడుతూ ప్రభుత్వ సాంఘీక సంక్షేమ వసతి గృహాల విద్యార్థుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అన్నారు. వసతి గృహాలు శిథిలావస్థకు చేరుకున్నాయని, దీంతో విద్యార్థులు తమ ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షం వస్తే వసతి గృహాల గోడలకు కరెంట్ షాక్ వస్తుందని, చాలా సందర్భాల్లో కరెంట్ షాక్‌కు కూడా గురికావడం బాధాకరమని అన్నారు. వసతి గృహాలకు పహారా గోడలు కరువయ్యాయని, అందువల్ల పందులు, కుక్కలు లోపలికి ప్రవేశించడంతో వాటితోనే సహజీవనం చేయాల్సి వస్తుందని అన్నారు. అంతేకాకుండా మరుగుదొడ్లు లేక రోడ్లపైకి వెళ్తున్నారని, దీంతో విద్యార్థులను జనం మందలించడం జరుగుతుందని అన్నారు. అదేవిధంగా మెనూ ప్రకారం ఆహారం అరకొరగా అందుతుందని, అందిన ఆహారంలో కూడా నాణ్యత లోపిస్తుందని అన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభంలోనే పలుమార్లు అధికారులకు వినిపించిన పట్టించుకోకుండా తనిఖీలు చేయకుండా, వారికి సీట్లకే పరిమితమై, వసతి గృహాల విద్యార్థుల సంక్షేమాన్ని గాలికొదిలేశారని అన్నారు. విద్యార్థులు వార్డెన్లను అడుగుతే మాకు బిల్లులు రాలేదని చేతులెత్తే పరిస్థితులు నెలకొన్నాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ వసతి గృహాల విద్యార్థుల సంక్షేమమే ముఖ్యమని చెపుతుందని, ఆచరించడంలో ఘోరంగా విఫలమైందని విమర్శించారు. కావున సంక్షేమ వసతి గృహాలను నాడు – నేడు పథకం కింద అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. కావున అధికారులు స్పందించి, వసతి గృహాలలో మౌళిక సదుపాయాలు కల్పించాలని లేనిపక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మరిన్నీ ఉద్యమాలకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు.

మండల ప్రభుత్వ కార్యాలయాలు

# అద్దె భవనాలకే అంకితమా?

- ఈ నిర్లక్ష్యానికి చరమగీతం పాడరా
- రూ. కోట్ల దుర్వినియోగమేనా
- మండలానికి అధికారులు రావాలంటే గుండెల్లో గుబులేనా
- ఇన్‌చార్జిల పాలనకు స్వస్తి లేదా



తహశీల్దార్ కార్యాలయం

**మహానంది, మేజర్‌న్యూస్ :** రాజులు పోయే ... రాజ్యాలు పోయే ప్రజల తలరాతలు మాత్రం మారలే అన్న చందంగా మహానంది మండల ప్రజల దుస్థితి తయారైందనడంలో అతిశయోక్తి లేదు. 1985లో మండల వ్యవస్థ ఏర్పడినా ఈ నాటికి కూడా మండల ప్రజల కష్టాలు తీరడం లేదు. మండల వ్యవస్థ మారలేదన డానికి మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలే ప్రధాన సాక్ష్యాలు. ఆ నాటి నుంచి ఈనాటి వరకు మండల ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లో ఇరుకు ఇరుకుగా కొనసాగుతున్నాయే తప్ప వ్యవస్థ మాత్రం మారడం లేదు. నిన్న కాక మొన్న వచ్చిన గ్రామ సచివాలయ వ్యవస్థలో మాత్రం అత్యంత సుందరంగా సచివాలయాల కార్యాలయాల్లో అధికారులు పాలన సాగిస్తున్నారు. తహశీల్దార్ కార్యాలయం తలరాత మారదేమోనన్న గుసగుసలు ప్రజల్లో వినిపిస్తున్నాయి. 1985లో ఏర్పడిన మండల వ్యవస్థలో తహశీల్దార్ కార్యాలయం



పాడుబడిన అద్దె భవనంలో కొనసాగుతున్న ఎంపీడీవో కార్యాలయం

తిమ్మాపురం గ్రామంలో ఒక చిన్న అద్దె భవనంలో ప్రారంభించారు. రాను రాను కాల క్రమేనా మండలంలో ప్రజలు పెరిగి ఆ కార్యాలయానికి వెళ్ళెందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో మహానంది గ్రామంలో గత 5 సంవత్సరాల క్రితం క్యాంపు కార్యాలయం ఏర్పాటు చేశారు. దీంతో మండల ప్రజలకు కాస్త ఊరట కలగడంతో అధికారులు ఈ కార్యాలయాన్ని మహానందిలో ఏర్పాటు చేసేందుకు దాదాపు రూ. కోటి వెచ్చించి తహశీల్దార్ కార్యాలయాన్ని నిర్మించారు. ఆ నిర్మాణం పూర్తయి రెండు సంవత్సరాలు పూర్తయినా ఇంత వరకు ప్రారంభానికి నోచుకోక పోవడంతో ప్రజల్లో నిరాశ, నిస్పృహలు మొదలవుతున్నాయి. ఈ కార్యాలయం ప్రారంభానికి ప్రభుత్వ అధికారులకు కానీ, ప్రజా ప్రజానిధులకు పట్టదా అంటూ మండల ప్రజలు విమర్శిస్తున్నారు. కార్యాలయాలను అద్దె భవనాలలో కొనసాగించే వ్యవస్థకు చరమగీతం పాడరా అంటూ ప్రజలు విమర్శిస్తున్నారు. మండలంలో 16 గ్రామాలు ఉండగా, కేవలం మూడు గ్రామాలకు మాత్రమే ఉపయోగపడే విధంగా ఉన్న ప్రభుత్వ కార్యాలయాలను ప్రజలకు అందుబాటులోకి తేరా అంటూ ప్రజలు



తహశీల్దార్ కొత్త కార్యాలయం

వాపోతున్నారు. మారుమూల గ్రామంలో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలను ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా శాశ్వత భవనాలను నిర్మించి కార్యాలయాలను ప్రజలకు అందుబాటులోకి తేవాలని మండల ప్రజలు కోరుతున్నారు. మండల కార్యాలయాల్లో ఒక్క తహశీల్దార్ కార్యాలయం తప్ప అన్ని కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయని ఒక్కొక్క భవనంలో రెండు, మూడు కార్యాలయాలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నారని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా మండల ప్రజల సమస్యలను పరిష్కరించే విధంగా నాయకులు కానీ ప్రజా ప్రతినిధులు కానీ జిల్లా స్థాయి, ప్రభుత్వ అధికారులు ఈ మండల వ్యవస్థను మార్చి ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా కార్యాలయాలను తెచ్చి ప్రజలకు సేవలు అందించే విధంగా అధికారులను నియమించి ఇన్‌చార్జిల పాలనకు చరమగీతం పాడి స్థాయికి తగిన ఉద్యోగులను నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

## కొనసాగుతున్న నిరాహార దీక్షలు

**కర్నూలు లీగల్, మేజర్‌న్యూస్ :** కర్నూలు జిల్లా న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం ధర్నా చౌక్ వద్ద కర్నూలుకు హైకోర్టును కేటాయించాలని కోరుతూ 48 గంటల నిరాహారదీక్ష రెండోరోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా న్యాయవాదులు ఎం.ఆర్.కృష్ణ, బాబాసాహెబ్, రాము, నరసింహులు, రాజాచంద్రమోహన్ తదితరులు దీక్షలు చేపట్టారు. వీరికి మద్దతుగా న్యాయవాదులు కాటం రంగడు, బద్దెల లక్ష్మినారాయణ, వై.జయరాజు, ప్రకాశ్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, ఇతర న్యాయవాదులు పెద్ద సంఖ్యలో చేరుకుని సంఘీభావం తెలిపారు. ఈ దీక్షలకు హిందూపురం బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ నాగప్ప, మహిళా న్యాయవాదులు, ఇతర న్యాయవాద సభ్యులు దాదాపు 50 మంది హిందూపురం నుంచి వచ్చి దీక్షల్లో కూర్చుని సంఘీభావం తెలిపారు. నగర మేయర్ బి.వై.రామయ్య, రైతు సంఘం జిల్లా కార్యదర్శి



దీక్షల్లో కూర్చున్న న్యాయవాదులు

సుంకన్న, హైకోర్టు సీనియర్ న్యాయవాది, బీజేపీ నాయకుడు పురుషోత్తంరెడ్డి తదితరులు దీక్షలకు మద్దతు తెలుపారు. నందికొట్కూరు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్, జనరల్ సెక్రటరీ శరబయ్య, సీనియర్ న్యాయవాది వెంకటరెడ్డి, ఇతర న్యాయవాదులు పెద్ద సంఖ్యలో హాజరై తమ మద్దతును తెలిపారు. జనసేన, సీపీఎం, బేడ బుడగ సంఘం తదితర సంఘాల నాయకులు కూడా దీక్షలకు మద్దతు ప్రకటించారు.

న్యాయ రాజధాని ఏర్పాటుకు

## భూమా మద్దతు కోరిన న్యాయవాదులు

**నంద్యాల రూరల్, మేజర్‌న్యూస్ :** కర్నూలులో న్యాయ రాజధాని ఏర్పాటుకు తెలుగుదేశం పార్టీ మద్దతు ఇవ్వాలని నంద్యాల పట్టణంలోని న్యాయవాదులు భూమా బ్రహ్మానందరెడ్డిని కలిసి మద్దతు కోరారు. కర్నూలులో న్యాయ రాజధాని ఏర్పాటుకు తమవంతు మద్దతు తెలియజేయాలని నంద్యాల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ పరిపాలన వికేంద్రీకరణలో భాగంగా ముఖ్యమంత్రి జగన్ మూడు రాజధానుల అజెండా తెచ్చారని అందుకు మద్దతుగా కర్నూలులో న్యాయ రాజధాని ఏర్పాటు చేయాలని విధులు బహిష్కరించి పోరాటం చేస్తున్నామని అన్నారు. ఈ ప్రాంతవాసిగా ప్రాంతాభివృద్ధికి తోడ్పాటు ఇవ్వాలని న్యాయవాదులు భూమాను కోరారు. అనంతరం భూమా మాట్లాడుతూ ఈ విషయాన్ని తమ అధినేత చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్తామన్నారు.



భూమాకు వినతిపత్రం అందిస్తున్న న్యాయవాదులు

## ఎన్టీఆర్ పేరు కొనసాగించాలి



సమావేశంలో మాట్లాడుతున్న గౌరు దంపతులు

**కల్లూరు, మేజర్‌న్యూస్ :** ఎన్టీఆర్ హెల్త్ యూనివర్శిటీకి ఎన్టీఆర్ పేరు తొలగించడంపై తెదేపా నంద్యాల జిల్లా అధ్యక్షుడు గౌరువెంకటరెడ్డి, పాణ్యం నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జ్ గౌరుచరిత ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఉన్న సంస్థలకు పేర్లు మార్చితే పేరు రాదని, కొత్తగా నిర్మించి పేర్లు పెట్టుకోవాలని సూచించారు. ఎన్టీఆర్ హెల్త్ యూనివర్శిటీకి వైఎస్ఆర్‌కు ఏం సంబంధం ఉందని ప్రశ్నించారు. ప్రభుత్వం పిచ్చి ఆలోచనలు మానుకుని హెల్త్ యూనివర్శిటీకి ఎన్టీఆర్ పేరును యదావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సింగిల్‌విండో ఛైర్మన్ ఎన్.వి.రామకృష్ణ, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌యాదవ్, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

## బాలల చట్టాలపై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న న్యాయమూర్తి

**కర్నూలు లీగల్, మేజర్‌న్యూస్ :** జిల్లా న్యాయసేవాధికార సంస్థ అధ్యక్షులు ఎ.శ్రీనివాసకుమార్ ఆదేశాల మేరకు ఆ సంస్థ కార్యదర్శి సి.హెచ్.వెంకట నాగశ్రీనివాసరావు బుధవారం న్యాయసేవాసదన్‌లో బాలల చట్టాలపై అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలలు పనిలో ఉండకుండా బడిలో ఉండాలి.. దీంతో మంచి నడవడిక అలవడుతుందన్నారు. ఎవరైనా పిల్లలతో పని చేయిస్తే.. బాలల చట్టం ప్రకారం రెండు సంవత్సరాలు జైలుశిక్ష ఉంటుందని తెలిపారు. అనంతరం ఈశ్రమ్ కార్డు గురించి, వాటి ఉపయోగాల గురించి అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ సాంబశివుడు అవగాహన కల్పించారు.

## మహిళలపై జరుగుతున్న నేరాలపై తక్షణ చర్యలు చేపట్టండి : డిఐజి

- పోలీసు గెస్ట్‌హౌస్‌ను ప్రారంభించిన డిఐజి
- నేర నియంత్రణకు చర్యలు చేపట్టండి
- శాంతి భద్రతల విషయంలో రాజీ లేకుండా పని చేయండి
- కర్నూలు రేంజ్ డిఐజి సెంథిల్ కుమార్

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్:** మహి ళలపై జరుగుతున్న నేరాలపై దృష్టి సారించి వాటిని నివారించే దిశగా చర్యలు తీసుకోవడంతో పాటు మహిళలపై జరుగుతున్న నేరాలపై వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని క ర్నూలు రేంజ్ డిఐజి సెంథిల్ కుమార్ అన్నారు. బుధవారం నంద్యాల జిల్లా ఆత్మకూరు సబ్ డివిజన్ పోలీసు స్టేషన్‌లో పోలీసు గెస్ట్‌హౌస్‌ను ప్రారంభించండ ంతో పాటు స్టేషన్‌ను తనిఖీ చేశారు. పోలీసు స్టేషన్‌కు చేరుకున్న డిఐజికి ఎస్పీ రఘువీర్ రెడ్డి, డిఎస్పీ శృతిలు పుష్పగుచ్చంతో స్వాగతం పలుకగా, ఎస్ఐ హుశేన్ బాష నుంచి డిఐసి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం స్టేషన్ పరిసరాలను పరిశీలించడంతో పాటు పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలు, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా డిఐజి మాట్లాడుతూ మహిళలపై నేరాలు అధికంగా జరుగుతున్నాయని, వాటిని నియంత్రించేందుకు తగు చర్యలు చేపట్టాలని, మహిళల అదృశ్యం కేసులపై ప్రత్యేక దృష్టి సారించి త్వరగా



పోలీసు గెస్ట్‌హౌస్‌ను ప్రారంభిస్తున్న డిఐజి సెంథిల్ కుమార్

పరిష్కరించాలన్నారు.నేరాల నియంత్రణలో భాగంగా పట్టణంలోని ప్రధాన కూడళ్ళలో, షాపింగ్‌కాంప్లెక్స్‌లలో సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకొనేలా చర్యలు తీసుకోవాలన్నారు. చాలా కాలంగా పెండి ంగ్‌లో ఉన్న కేసులను వెంటనే పరిష్కరించాలని, వివిధ కేసుల్లో పట్టుబడ్డ వాహనాలను సంబంధిత అధికారుల అనుమతితో డిస్పోజల్ చేయాలని సూచించారు. నాటుసారా, అక్రమ మద్యం రవాణతో పాటు అసాంఘీక శక్తుల అణిచి వేతకు కట్టుదిట్టు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే శాంతి భద్రతల విషయంలో రాజీ పడకుండా పనిచేసి ప్రజలకు రక్షణ కల్పించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సిఐ సుబ్రమాణ్యం, ఎస్ఐలు కృష్ణమూర్తి, హుశేన్‌బాష, డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య పనులు పరిశీలించిన మున్సిపల్ కమీషనర్

**నంద్యాల టౌన్, మేజర్‌న్యూస్ :** పట్టణంలోని 3,4వ వార్డుల్లో మున్సిపల్ కౌన్సిలర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్, శానిటరీ, సచివాలయ సిబ్బందితో కలిసి వార్డుల పారిశుద్ధ్య పనులను, పబ్లిక్ టాయిలెట్లను మున్సిపల్ కమీషనర్ చింతా రవిచంద్రారెడ్డి బుధవారం పరిశీలించారు. పట్టణంలోని శ్రీనివాస్ సెంటర్‌లో ఉన్న డ్రైన్‌లో పూడికను శానిటేషన్ సిబ్బందితో చెత్త తీయించారు. ఎన్టీఆర్ కాంప్లెక్స్ వద్ద రోడ్డు పక్కనున్న షాపుల యజమానులు రోడ్డు పై చెత్తను వేయడం చూసి సంబంధిత షాప్ యజమానులకు అవగాహన కల్పించి పాడేసిన చెత్తను వారి షాపుల వద్ద ఉన్న చెత్త బుట్టల్లో వేయించారు. మున్సిపల్ కమీషనర్ రవిచంద్రారెడ్డి మాట్లాడుతూ డ్రైన్‌లో నిలిచి ఉన్న నీరు, శుభ్రం చేయడం వంటి చర్యలు, నిల్వ చెత్తను తొలగించి వర్షపు నీటి ప్రవాహానికి అడ్డం లేకుండా చర్యలు తీసుకోవాలని పారిశుద్ధ్య సిబ్బందిని ఆదేశించారు. అనంతరం నడిగడ్డలోని పురపాలక ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న నాడు నేడు పనులను పరిశీలించి పాఠశాల సిబ్బంది, విద్యార్థులతో మాట్లాడారు.



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమీషనర్

